కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి: రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే 3(ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికలు సెమీ ఫైనల్స్ అయితే పార్లమెంట్ ఎన్నికలు ఫైనల్స్ అని, సెమీ ఫైనల్స్‌లో తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఫైనల్స్ అయిన పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు గడగడపకు వెళ్లి పార్టీని గెలిపించాలని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అత్తాపూర్ ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో యువజన కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనపై భూ కబ్జాలు, దానా కుంభకోనం అంటు చేస్తున్న ఆరోపనలలో ఒక్కటైనా నిరూపించాలని అందుకు ఆయన ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని సవాల్ విసిరారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను పూర్తి చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోరుకునే పార్టీ కాంగ్రెస్ అన్నారు. యువజన కాం గ్రెస్ నాయకులు ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు.



యూత్ కాంగ్రెస్ సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, మహ్మద్ ఫహీమ్ ఖురేషీ, శివసేనారెడ్డి, పారిజాతానర్సింహారెడ్డి

రంజిత్‌రెడ్డి రాముడు.. మా వదినే సీత

● కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేశ్



బీజేపీ నాయకులు జై శ్రీరాం అంటున్నారు.. మా రంజిత్‌రెడ్డే రాముడు.. మా వదినే సీత అని కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేశ్ అన్నారు. రామ సీతలను చేవెళ్ల ఎంపీగా గెలిపించండి అని యువజన కాంగ్రెస్ నాయకుల కరతాళధ్వను ల మధ్య మాట్లాడారు. మేము రామ భక్తులమే, మేము ఆంజనేయ భక్తులమే, మేము వేంకటేశ్వరస్వామి భక్తులమే అన్నారు. మేము పక్క హిందువులమే.. ముస్లింలను గౌరవిస్తాం.. క్రిస్టియన్లను అభిమానిస్తాం అన్నారు. అన్నింటికంటే భారతదేశాన్ని గర్వంగా చెప్పుకుంటాం.. భారతీయులమని సగర్వంగా చెప్పుకుంటాం అన్నారు. ప్రతి ఒక్కరూ రంజిత్‌రెడ్డికి ఓటు వేసి చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి జీషన్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డితో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచండి

సరూర్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం ఓటర్లు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచి, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల స్థానం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలని యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కోరారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం ఆయన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లో గల పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వంద రోజుల్లోనే అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి కాంగ్రెస్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం రంజిత్‌రెడ్డి

ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం

చందానగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని ఆ పార్టీ చందానగర్ డివిజన్ సీనియర్ నాయకుడు, కాపు సంఘం నాయకుడు మిరియాల రాఘవరావు, మాజీ కౌన్సిలర్ సునీతారెడ్డి, రఘుపతిరెడ్డి, ఉరిటి వెంకట్రావ్, లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని వెంకటాద్రికాలనీ, చందానగర్‌లో ఇంటింటికీ ప్రచారం చేశారు. సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ ఆయనను ఎంపీగా గెలిపించాలని వారు కోరారు.

రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

హైదర్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బత్తిన వెంకటేష్‌గౌడ్ తన అనుచరులతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, గిరిప్రసాద్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, సయ్యద్, యాదగిరి, నరసింగరావు, హేమలత, రఘు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న రాఘవేందర్‌రెడ్డి తదితరులు

కార్యకర్తలే పార్టీకి బలం, బలగం

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే పార్టీకి బలం, బలగం అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలందరూ కలిసికట్టుగా ఉండి కష్టపడి పనిచేసి కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తూ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంటీసీ చైర్మన్ మల్కాజిగిరి నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి, రావుల అంజయ్య, కరంచంద్ పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

అల్వాల్, మే3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శుక్రవారం అల్వాల్ డివిజన్‌లో ఎంటీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని ఆమె గుర్తు చేశారు. ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారెంటీల మోసం పై ప్రజలకు వివరించాలని ఆమె పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, హనుమంత్, మల్లేష్, గిరి, లింగారెడ్డి, యాదగిరిగౌడ్, నందిని, శ్రీమతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

సిద్ధేశ్వరస్వామి కృప ప్రజలందరిపైనా ఉండాలి

కుత్బుల్లాపూర్: సిద్ధేశ్వరస్వామి కృప ప్రజలందరిపైనా ఉండాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పద్మానగర్ ఫేజ్-2లోని గంగాలలితాకామేశ్వరి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ మేరకు వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త ము రళి, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, ప్రధానార్చకులు విశ్వనాథశర్మ పాల్గొన్నారు.



పట్టుబడిన బెట్టింగ్ ముఠాతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తు

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- రూ. 20 లక్షలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బెట్టింగ్ ముఠాలోని సబ్‌బుకీతో పాటు ముగ్గురు పంటర్లను ఎల్బీనగర్ ఎస్ఓటీ, ఎల్బీనగర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. హస్తినాపురం ఆర్కేఆర్ కాలనీకి చెందిన వ్యాపారి తొండలపల్లి కార్తీక్‌రెడ్డి (29) క్రికెట్ బెట్టింగ్ ముఠాలో సబ్‌బుకీగా ఉన్నాడు. ఇతడు పంటర్లు కర్మన్‌ఘాట్ నిర్మలానగర్‌కు చెందిన కసిరెడ్డి అభిషేక్ రెడ్డి (28), పత్తికోట యాదగిరి, సరూర్‌నగర్ జ్యోతి కాలనీకి చెందిన మేక రాజవర్ధన్‌రెడ్డి(30) సాయంతో బెట్టింగ్‌లు స్వీకరిస్తూ విజయవాడకు చెందిన సందీప్‌రెడ్డి, రాజస్థాన్‌కు చెందిన మనోజ్ అనే ప్రధాన బుకీలకు బెట్టింగ్ మొత్తాలను పంపిస్తున్నాడు. ఇతడికి ఖమ్మం ప్రాంతానికి చెందిన చైతన్య, నాగోల్‌కు చెందిన ప్రవీణ్ అనే ఇద్దరు పంటర్లు కూడా బెట్టింగ్‌లు నిర్వహించడంలో సహకరిస్తున్నారు. హస్తినాపురం బీకేఆర్ కాలనీలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఓ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బెట్టింగ్ స్వీకరిస్తున్న సబ్‌బుకీ కార్తీక్‌రెడ్డి, పంటర్లు అభిషేక్‌రెడ్డి, యాదగిరి, రాజీవర్ధన్‌రెడ్డిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.20 లక్షల నగదు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా గేమింగ్ ఖాతాలోని రూ. 3.85 లక్షలు ఫ్రీజ్ చేయించారు.

సైబర్ నేరగాళ్లతో పీర్ టు పీర్ ట్రేడింగ్ చేస్తే ఖాతాలు ఫ్రీజ్

- సైబరాబాద్ సీపీ

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లతో పీర్‌టు పీర్ క్రిప్టో ట్రేడింగ్ చేస్తే ఖాతాలు సీజ్ అవుతాయని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బును రాబట్టుకునేందుకు టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పీర్ టు పీర్ క్రిప్టో ట్రేడింగ్ చేసేవారిని సంప్రదిస్తారు. క్రిప్టో ట్రేడింగ్ ద్వారా డబ్బును మార్చుకుంటారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే, డబ్బు పడిన మ్యూల్ ఎకౌంట్‌తోపాటు ఆ ఖాతా ద్వారా లావాదేవీలు చేసిన ఖాతాలు కూడా ఫ్రీజ్ అవుతాయని తెలిపారు. పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మవద్దని, క్రిప్టో ట్రేడింగ్ పేరుతో వచ్చే ఫోన్లు, సందేశాలను పట్టించుకోవద్దని సీపీ హెచ్చరించారు. కొత్త వారితో పీర్ టు పీర్ క్రిప్టో ట్రేడింగ్ చేయవద్దని, డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

మైనర్లకు సమాజ సేవ శిక్ష

బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లకు జువైనల్ కోర్టు సమాజసేవ శిక్షను విధించింది. బంజారాహిల్స్ పోలీసులు రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఏడుగురు మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వీరిని జువైనల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి సైదాబాద్‌లోని జువైనల్ హోంలో రెండు రోజులపాటు సమాజ సేవ నిర్వహించాలని తీర్పునిచ్చారు.

దేశాభివృద్ధి ఒక్క బీజేపీతోనే సాధ్యం

- ఈటల జమున

జవహర్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మన దేశాభివృద్ధిని కోరుకునే వారందరు బీజేపీకే ఓటు వేయాలని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈట ల జమున అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్‌లోని మార్వాడిలైన్‌లో మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి లిఖితయాదవ్ నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీమంత్రి సతీమణి ఈటన జమున హాజరై మాట్లాడారు. బీజేపీ అందిస్తున్న కేంద్ర పథకాలను వివరించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీజేపీ పాలన సాగిస్తుందని ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఈటలను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు కమల్, మాజీ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, మహిళ నాయకులు లక్ష్మీరెడ్డి, రాజేశ్వరీ, లతా, నాయకులు సంతోష్ గుప్తా, యాదగిరి పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లోని మార్వాడిలైన్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల సతీమణి జమున

బీజేపీని గెలిపించుకుంటాం: భేతి

కుషాయిగూడ: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా శుక్రవారం కాప్రా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గాంధీనగర్, శ్రీరామ్‌నగర్, బాలాజీ ఎన్‌క్లేవ్‌లో పాదయాత్ర చేస్తూ కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఏ.వినోద్‌కుమార్, నాగరాజ్‌గుప్తా, ఎస్.రాజు, వి.మల్లేష్, అరుణజ్యోతి, పద్మలత, సుభాషిణి, సీహెచ్.కుమారి, వి.అశోక్, బి.శ్రీధర్ పాల్గొన్నారు.



కాప్రాలో ఎన్నికల ప్రచారంలో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

కార్పొరేటర్ చేతన ప్రచారం

రామంతాపూర్: బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా హబ్సిగూడ డివిజన్ పరిధిలోని మహేశ్వరినగర్, గాంధీ గిరి జన బస్తీలో శుక్రవారం కార్పొరేటర్ చేతన హరీష్ ప్రచారం పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు హరీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి కమలం గుర్తుపై ఓటు వేసి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లాచారి, గడ్డం సాయి, రాగి లతా వెంకట్‌రెడ్డి, రమేష్‌నాయక్, పద్మీయనాయక్ పాల్గొన్నారు.

మోదీని మళ్లీ ప్రధానమంత్రిని చేయాలి

పేట్‌బషీరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీని మళ్లీ ప్రధానమంత్రిని చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ ఎన్నికల పరిశీలకులు రాజస్థాన్ ప్రభుత్వ మాజీమంత్రి రాజేంద్రరాథోడ్ అన్నా రు. శుక్రవారం కొంపల్లి పరిధిలోని ఎన్‌సీఎల్ కాలనీ జిల్లా నాయకులు శివాజీరాజ్ నివాసంలో ముఖ్య నాయకులతో రాజస్థాన్ మాజీమంత్రి దేవనారాయణ్‌తో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివాకర్, కిసాన్ మోర్చా కమిటీ సభ్యులు డాక్టర్ చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్‌సాగర్, బీజేపీ నాయకులు రాజిరెడ్డి, రవి, సరితారావు, జగన్, శంకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సూర్యకళ, ఉదయ్, సంధ్య, మాధురి పాల్గొన్నారు.

మూడోసారి ప్రధానిని చేయాలి

ఫతేనగర్: మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలని, బీసీలకు మొట్టమొదటిగా చట్టబద్ధత కల్పించింది మోదీనేనని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. బీజేపీ ఫతేనగర్ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన బీజేపీ ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే అమిత్‌షా సభకు బీజేపీ శ్రేణు లు పెద్దసంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

అమలుకు నోచుకోని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ

ఎల్బీనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): అమలుకు నోచుకోని హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేసి లబ్ధిపొందాలని చూస్తున్నదని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆరోపించారు. శుక్రవారం సరూర్‌నగర్‌లో ఆకుల అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. దేవుడి పేరు చెప్పి బీజేపీ రాజకీయం చేస్తుంటే రాజ్యాంగం మారుస్తారంటూ కాంగ్రెస్ రాజకీయం చేస్తుందన్నారు. ఆకుల అరవింద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో రెడ్లకే గౌరవం ఉందని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గౌరవం లేదన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, రిషి, సుధామ, ఇస్మాయిల్, జహీర్, ఉషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆకుల అరవింద్

చేవెళ్లలో కాసానిని గెలిపించుకుంటాం: రాంరెడ్డి

సరూర్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల నియోజకవర్గం ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుని, మాజీమంత్రి సబితారెడ్డి సహకారంతో ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటామని బీఆర్ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ పరిధిలో గల పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేయాల్సిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, పార్టీ నాయకులు బోయపల్లి శేఖర్‌రెడ్డి, రామిడి తూఫాన్‌రెడ్డి, చప్పిడి కొండల్‌రెడ్డి, కొంతం రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.



వివిధ పార్టీల యువతను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

యువత చూపు బీఆర్ఎస్ వైపే

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తించి పలు పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరుతుండ డం హర్షణీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారుడు దూసరి మధు గౌడ్ ఆధ్వర్యంలో వనస్థలిపురం డివిజన్‌కు చెందిన ఇతర పార్టీల యువకులు ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో చెనగోని విఠల్‌గౌడ్, రామకృష్ణ, నిఖిల్, రోహిత్, సంపత్, పవన్, హరీష్, సుమంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కలానగర్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా గెలిపించండి భారీ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ భారీ మెజార్టీతో ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మునిసిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి, రామలింగం, శంకరయ్యగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్ జంగయ్య

ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ పాడి జంగయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు కలానగర్‌కు చెందిన మస్తాన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

టీకేఆర్ కళాశాల ట్రెడిషనల్ డే వేడుకల్లోకి నకిలీ విద్యార్థులు ఎంట్రీ

- అసలు విద్యార్థుల ఆందోళన
- యాజమాన్యంతో వాగ్వాదం



కళాశాల గేటు ఎదుట గుమిగూడిన విద్యార్థులు

సరూర్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం రాత్రి గందరగోళం నెలకొంది. కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వార్షికోత్సవంలో భాగంగా గురువారం ట్రెడిషనల్ డే వేడుకలు నిర్వహించగా.. అనేక మంది యువకులు నకిలీ ఐడీ కార్డులు తయారు చేసుకుని ఈవెంట్‌లోకి ప్రవేశించారు. దాంతో అసలు విద్యార్థులు వచ్చే సరికి కళాశాల ప్రాంగణం మొత్తం నిండిపోవడంతో వారిని లోపలికి అనుమతించలేదు. దాంతో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అసలు విద్యార్థులు కళాశాల గేటు ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కళాశాల ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జి సతీశ్‌రెడ్డి విద్యార్థులతో దురుసుగా మాట్లాడడంతో విద్యార్థులు గేటు దూకి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. దాంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. కళాశాల యాజమాన్యం విద్యార్థుల గుర్తింపు కార్డులను సక్రమంగా పరిశీలించి లోపలికి అనుమతించాల్సి ఉండగా.. నకిలీ విద్యార్థులను అనుమతించి తమను అడ్డుకున్నారని పలువురు విద్యార్థులు వాపోయారు. కాగా శుక్రవారం జరుగనున్న షిజ్నే-2024లో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని యాజమాన్యం పేర్కొంది.

'టీకేఆర్'లో కోలాహలంగా 'షిజ్నే-2024'

- గాత్రంతో సందడి చేసిన గాయకుడు కార్తీక్



పాటలతో హోరెత్తిస్తున్న కార్తీక్

సరూర్‌నగర్, మే 3(ఆంధ్రజ్యోతి): నగర శివారు మీర్‌పేట్‌లోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 'షిజ్నే-2024' పేరుతో మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పాప్ సింగర్ కార్తీక్‌తో ఏర్పాటు చేసిన 'లైవ్ కాన్సెర్ట్' విద్యార్థులను ఉర్రూతలూగించింది. తన మధుర గాత్రంతో కార్తీక్ పాడిన పాటలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆయన పాటలకు అనుగుణంగా స్టెప్పులేస్తూ సందడి చేశారు. కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి, కార్యదర్శి తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.89 లక్షల నగదు స్వాధీనం..!

చాదర్‌ఘాట్, మే 3(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తోన్న తనిఖీల్లో రూ.5.89 లక్షల నగదు పట్టుబడింది. మలక్‌పేట పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా నగదు తీసుకెళ్తోన్న ఓ వాహనం గుర్తించారు. ఏటీఎంలో నగదు జమ చేసేందుకు వెళ్తున్నామని వాహనంలో ఉన్న వ్యక్తులు చెప్పినా.. సరైన పత్రాలు లేకపోవడంతో ఆ మొత్తం స్వాధీనం చేసుకొని ఎన్నికల అధికారులకు అప్పగించారు.

సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలి

కొత్తపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ కార్యకర్తలను కోరారు. శుక్రవారం టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ముబాబుతో పాటు పలువురు కార్యకర్తలు మధుయాష్కీగౌడ్, అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మధుయాష్కీగౌడ్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిరంతరం కృషి చేస్తానని అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్‌గౌడ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అవంతి కళాశాలలో జాబ్ మేళా

చాదర్‌ఘాట్, మే 3(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో గురు,శుక్రవారాల్లో జరిగిన జాబ్‌మేళాలో వివిధ కళాశాలలకు చెందిన 180మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయి. 16 కళాశాలలకు చెందిన దాదాపు 480మంది విద్యార్థులు పాల్గొన్న ఈ జాబ్‌మేళాలో పేరొందిన 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఈమేరకు 180మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

వ్యక్తి అదృశ్యం

కొత్తపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాని సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజ్యలక్ష్మి కాలనీలో పోడెం రవితేజ(33) భార్య స్వప్నతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రవితేజ తిరిగి రాలేదు. దాంతో అతడి భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న నాగోల్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



మీట్‌దీ ప్రెస్‌లో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

బర్కత్‌పుర, మే 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే దమ్ము ధైర్యం కేసీఆర్‌కు, మోదీకి లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ మాదిరిగానే దేశంలోని ప్రజలంతా మార్పును కోరుకుంటున్నారని మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాబోతున్నదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పదికిపైగా ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ నాలుగు నెలల్లో కాంగ్రెస్ పాలన ప్రజల నుంచి మంచి ఆదరణ పొందుతున్నదని, ఇది చూసి ఓర్వలేకనే మోదీ, కేసీఆర్‌లు రకరకాల కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమిత్‌షా వీడియో మార్ఫింగ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని కుట్ర చేస్తున్నారని, రాష్ట్రాన్ని దేశాన్ని లూటీ చేసిన కేసీఆర్, మోదీలపై ఎందుకు కేసులు పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. మూడవసారి అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని మార్చడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దుచేయడానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆయన ఆరోపించారు. బీజేపీ ఝూటా పార్టీగా మారిపోయిందని, ప్రశ్నించే వ్యక్తులను దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కోవీషీల్డ్, కోవ్యాక్సిన్‌ల వల్ల సైడ్‌ఎఫెక్ట్‌లతో ఎంతో మంది చనిపోతున్నా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఎందుకు నోరుమెదపడటం లేదని, దీనిపై శాస్త్రీయ పరిశోధనలు ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రమాదకర స్థితిలో ఉందని, దానిని కాపాడుకోవడానికి ప్రజలు మోదీ పాలనకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, నాయకులు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

బీజేపీని ప్రశ్నిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం..

- ప్రొఫెసర్ జి.హరగోపాల్

షాద్‌నగర్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని ప్రశ్నిస్తూ ప్రమాదంలో పడబోతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ పీపుల్స్ జేఏసీ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం హరగోపాల్ మాట్లాడారు. బీజేపీ పన్నుల పేరుతో పేదలను దోచి, పెద్దలకు పెడుతూ వస్తున్నదని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తోందన్నారు. ఎన్నికల తర్వాత బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే.. ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉంటాయా? అన్న ప్రశ్న తలెత్తుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే ప్రజా సంఘాలు, జర్నలిస్టుల పరిస్థితులు ఎలా ఉంటాయోనని భయం వేస్తోందన్నారు. ఏకపక్ష నిర్ణయాలు, కక్షసాధింపు చర్యలు, స్వార్థపూరిత రాజకీయాలకు ఒడిగడుతున్న బీజేపీని ప్రజలు ప్రశ్నించాలని కోరారు.

తెలంగాణ పీపుల్స్ జేఏసీ కో-కన్వీనర్ రవిచంద్ర మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించకపోగా.. వ్యవసాయ భూముల్లో కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించిందని ఆరోపించారు. ప్రభుత్వాలు మారినా సమస్యలపై తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు వనమాల, సత్య, అర్జునప్ప, తిరుమలయ్య, ముత్తయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరోమారు మోదీ సర్కార్

- చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): దేశం సుభిక్షంగా ప్రజలు సురక్షితంగా ఉండాలంటే కేంద్రంలో మరోమారు మోదీ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం మొత్తం మరో మారు మోదీ సర్కార్ అని నినదిస్తుందన్నారు. మోదీ సర్కార్‌పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తున్నదన్నారు. ఆ నిధులతోనే వీధిదీపాలు, పారిశుధ్యం, పార్కుల నిర్వహణ వంటి పనులు చేస్తున్నారని ఆయన తెలిపారు. కానీ గత ప్రభుత్వం ఆ విషయాలను ప్రజలకు చెప్పకుండా అన్నీ తామే చేస్తున్నామని చెప్పుకున్నారన్నారు. గత ప్రభుత్వం అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలను ఇచ్చి ఒక్కదాన్ని కూడా పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దీరజ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్, కార్పొరేటర్లు రాధధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణిఅంజన్, మాజీ కౌన్సిలర్ స్వరూప, బీజేపీ డివిజన్ అధ్యక్షులు సిద్ధు, రాములుయాదవ్, కిరణ్‌రాజ్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై పోలీసుల నజర్

హైదరాబాద్ సిటీ : రాంగ్‌రూట్ డ్రైవింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని నియమించి నిరోధించాలని సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్ అధికారులకు సూచించారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో ట్రాఫిక్ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించేలా ఆయా ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం

- మూడు అంతస్తులకు వ్యాపించిన పొగ
- ఆందోళనకు గురైన వినియోగదారులు
- ప్రాణభయంతో పరుగులు..
- పై నుంచి దూకడంతో ఇద్దరికి గాయాలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



దిగేందుకు నిచ్చెన సాయం తీసుకుంటున్న యువతీ, యువకులు

దిల్‌సుఖ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పరిధిలోని మోహన్‌నగర్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. పొగ మూడు అంతస్తులకు వ్యాపించడంతో గదుల్లో ఉన్నవారంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భయంతో గోడలు దూకి తప్పించుకున్నారు. ఈ క్రమంలో రెండవ అంతస్తు నుంచి కిందకు దూకే ప్రయత్నంలో కిందపడిన ఓ యువతి, యువకుడు గాయాలపాలయ్యారు. సకాలంలో చైతన్యపురి పోలీసులు స్పందించి, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ ప్రమాదానికి సంబంధించి చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

మోహన్‌నగర్‌లో వెంకటేశ్వర అతిథి పేరిట నాగసిద్ధార్థ ఓయో హోటల్ నిర్వహిస్తున్నాడు. మూడు అంతస్తుల్లో 23 గదులుండగా అందులో 11 గదుల్లో ప్రజలు అద్దెకు దిగారు. అయితే శుక్రవారం తెల్లవారుఝామున సుమారు 3.10 గంటల సమయంలో హోటల్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని రిసెప్షన్ వద్ద ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో అక్కడ ఉన్నటువంటి ఫర్నిచర్ ఇతర సామగ్రి మంటలకు కాలిపోయింది. ఫలితంగా హోటల్ మూడు అంతస్తులకు పొగ వ్యాపించింది. ఈ క్రమంలో గదుల్లోకి భరించలేని వేడి రావడంతో అందులోని వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అర్ధరాత్రి వేళ ఏం జరుగుతుందో అర్థంకాక ప్రాణభయంతో హోటల్ నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు పైనుంచి కిందకు దూకారు. ఈ క్రమంలో రెండవ అంతస్తులో ఉన్న సంజు, లహరి మొదటి అంతస్తుకి వచ్చి అక్కడ నుంచి కిటికీల ద్వారా పక్కనే ఉన్న షెడ్డు మీదకు దూకారు. దీంతో లహరి చేతికి, సంజు కాలుకు గాయాలయ్యాయి. పొగతో ఊపిరాడక మరో నలుగురు ఇబ్బందిపడడంతో అందరినీ పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న ఫైర్ సేఫ్టీ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్‌ఇంజన్ ద్వారా మంటలను అదుపులోకి తీసుకురావడంతో ఊపిరి పీల్చుకున్నారు. గదుల్లో ఉన్న వారిని నిచ్చెన ద్వారా కిందకు తీసుకువచ్చారు.

హోటల్ నిర్వాహకుడు నాగసిద్ధార్థ ఫైర్‌సేఫ్టీ భద్రతా ప్రమాణాలు పాటించక పోవడం వల్లనే అగ్ని ప్రమాదం సంభవించిందన్న ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.